దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

## సురేఖకు ప్రోటోకాల్ భద్రత ఉపసంహరణ

మంత్రి పదవి నుంచి తొలగించిన మరుసటి రోజే కొండా సురేఖకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో ఊహించని షాక్ ఇచ్చింది. గురువారమే ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్, తాజాగా ఆమెకు కేటాయించిన అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం మంత్రి హోదాలో ఆమెకు సమకూర్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని అధికారులు ఇప్పటికే స్వాధీనం చేసుకోగా, తాజాగా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మెన్లను సైతం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది. దీంతో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా రద్దయ్యాయి.మంత్రి పదవి కోల్పోవడంతో అధికారిక ప్రోటోకాల్ వర్తించదన్న నిబంధనల మేరకే ఈ భద్రత ఉపసంహరణ చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నప్పటికీ, పరిణామాలు వేగంగా మారడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. మంత్రివర్గం నుంచి తొలగించిన కొద్ది గంటల వ్యవధిలోనే కాన్వాయ్ వాహనాన్ని, భద్రతా సిబ్బందిని వెనక్కి తీసుకోవడం కొండా కుటుంబంపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో కొరడా ఝుళిపిస్తోందన్న సంకేతాలను ఇస్తోంది. కేబినెట్ నుంచి బర్తరఫ్, భద్రత రద్దు వంటి వరుస షాక్‌ల నేపథ్యంలో కొండా సురేఖ తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఎలా ముందుకు తీసుకెళ్తారనేది తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

సంపుటి: 3 | సంచిక : 239 | శనివారం 05. 9. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00

## 'ఇస్రో' విజయం.. దేశానికి గర్వకారణం



- ఇస్రో సాధించిన చరిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోదీ అభినందనలు
- "ఇస్రో సాధించిన మరొక అద్భుతమైన విజయం ఇది.
- మన దేశానికి ఇది ఎంతో గర్వకారణమైన క్షణం.
- జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఈవోఎస్-05.
- జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం..
- భారత అంతరిక్ష రంగం సాధిస్తోన్న అత్యుత్తమ ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది.
- శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17



# పనులు త్వరగా పూర్తి చేయాలి

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం పర్యటన
- మద్దూరులో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులు పరిశీలన
- పాఠశాల నిర్మాణ ప్రణాళికలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు
- ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు
- హకీంపేటలో విద్యా హబ్ నిర్మాణ పనులు పరిశీలన



నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మద్దూరుకు చేరుకున్న సీఎం ముందుగా డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 13,670 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో మూడు అంతస్తులుగా కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఏఈ డబ్ల్యూఐడీసీ ఎండీ గణపతి రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయాలని సీఎం సూచించారు. అది పట్టా భూమి అయితే హక్కుదారుల నుంచి కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణంతో పాటు ప్రహరీ గోడ నిర్మించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను మార్చి నెలలోపు పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అనంతరం గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## కొండా సురేఖ తీరు ఆక్షేపణీయం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుంది
- క్రమశిక్షణ విషయంలోనూ పార్టీ అంతే కఠినంగా ఉంటుంది
- "కొండా సురేఖ కాంగ్రెస్‌లో కొనసాగుతానని చెప్పారు.
- పార్టీలో ఉంటే తప్పకుండా అవకాశం ఇస్తాం.
- గురువారం కొండా సురేఖ ఆవేశం, ఆవేదనతో మాట్లాడారు.
- ఇకపై అలా మాట్లాడకూడదని సూచిస్తున్నా.
- పార్టీలో ఎవరికైనా ఇబ్బందులుంటే నేరుగా పీసీసీ అధ్యక్షుడి వద్దకు వచ్చి చెప్పుకోవచ్చు.
- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, అధిష్ఠానాన్ని కలవచ్చు.
- తమ ఆవేదన వ్యక్తం చేయొచ్చు.
- అంతేకానీ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ సహించదు.



## ఆ ప్రచారం నమ్మొద్దు..



- త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుందని తాను ప్రకటించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన మాజీ మంత్రి కొండా సురేఖ
- కొండా సురేఖ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతాలో "త్వరలో బిగ్ అప్‌డేట్ ఉంటుంది. 'వెయిట్ ఈజ్ ఆల్‌మోస్ట్ ఓవర్'.." అంటూ ఆసక్తికర పోస్టు సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.
- "వివిధ సోషల్ మీడియా వేదికల్లో నా పేరుతో ప్రసారమవుతున్న పోస్టులతో మాకు ఎలాంటి సంబంధం లేదు.
- మీడియా ప్రతినిధులు, ప్రజలు కేవలం అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతున్నాం"

## సెప్టెంబర్ 6న బీఆర్ఎస్ ఎల్పీ భేటీ

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపక్షతన వ్యూహాలకు పదును పెడుతోంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు సెప్టెంబర్ 6వ తేదీన ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశానికి రావాల్సిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ సమావేశాలు మరింత వాడీవేడీగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేలా పార్టీ సభ్యులకు ఈ సమావేశంలో కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, సాగునీటి ప్రాజెక్టులు,కాళేశ్వరం బ్యారేజీలు, పాలిటెక్నిక్ విద్య, వ్యవసాయం, రైతు సంక్షేమం, పథకాల అమలు, లా అండ్ ఆర్డర్ వంటి అంశాల్లో ప్రభుత్వాన్ని కార్నర్ చేసే విషయంలో గులాబీ బాస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో హామీల అమలుపై నిలదీసే చాన్స్ ఉంది.

## పౌరసత్వ కొత్త రూల్స్‌కు కోర్టు బ్రేకులు

### జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేత

### సుప్రీంకోర్టులోనూ ట్రంప్‌నకు చుక్కెదురు



**తొలి సమయం హైదరాబాద్** జన్మతః పౌరసత్వంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో చుక్కెదురైంది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు సహజంగా లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు, అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా పరిమితులు తీసుకురావాలని ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేసిన మిగతా 2లో..

## కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలి

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష

### దోభీ ఘాట్‌ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశం



**తొలి సమయం హైదరాబాద్** తెలంగాణా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చెయ్యాలని తెలంగాణా సర్కార్ సంకల్పించింది. ఈ క్రమంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అనేక కీలక నిర్ణయాలను తీసుకుంటుంది. ఈ క్రమంలోనే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం మిగతా 2లో..



## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకోం

**తొలి సమయం హైదరాబాద్**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు. "పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు"

## బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలన్నీ అభివృద్ధి చేస్తాం

భద్రాచలం: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని స్వామి వారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.351 కోట్లతో చేపడుతున్న ఆలయ పునఃనిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. భద్రాద్రి ఆలయాన్ని భక్తులు మెచ్చేలా విశాలంగా, అత్యంత సుందరంగా పునర్నిర్మిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న అన్ని ఆలయాలను పుష్కరాల నాటికి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందులోభాగంగానే రాములోరి ఆలయాన్ని, భద్రాచలం పట్టణాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.





## ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలే

### బీఎస్పీ పార్టీ అధినేత్రి మాయావతి

**తొలి సమయం హైదరాబాద్** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో మిగతా 2లో..

## కొండా సురేఖ సరే మరి పొంగులేటి సంగతేంటి?

### మాజీ మంత్రి హరీశ్ రావు



**తొలి సమయం హైదరాబాద్**

22-A భూముల విషయంలో బొంకుతున్నారని మంత్రి పొంగులేటి మంత్రి పొంగులేటి కాదని ఆయన బొంకులేటి అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలపై ఇవాళ సిర్పూర్ బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో మాట్లాడిన హరీశ్ రావు.. తనను తిట్టారని కొండా సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్ రెడ్డి.. మరి నిషేధిత భూముల పేరిట ప్రజలను పట్టి పీడిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డితో పొంగులేటికి ఏం పొత్తుందో చెప్పాలన్నారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్ రెడ్డి నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే.. కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని, రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ లోనే ఉందని రేవంత్ ఇల్లు నిషేధిత జాబితాలో పడితే రాత్రికి రాత్రే తీసేసుకున్నాడు.. మరి పేదలకు ఒక న్యాయం, ముఖ్యమంత్రికి ఇంకో న్యాయమా? అని ప్రశ్నించారు. 22-A ఒక్క చోట జరిగిన తప్పు కాదని కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏకంగా 42,867 ఎకరాల రైతుల భూములు 22ఏ జాబితాలో బందీ అయిందన్నారు. నిషేధిత జాబితాలో పెట్టారని నిషేధంలో పెట్టిన పేదల భూములను ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ఎంబీబీఎస్ మెడికల్ సీట్లలో శ్రీ వశిష్ట అద్భుత ఫలితాలు...

- పరిస్థితులు ఎలా ఉన్న మన లక్ష్యం పెద్దదిగా ఉండాలి...
- సీహెచ్ వెంకటేష్ ఎంబీబీఎస్



**తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 4**

విద్యార్థుల లక్ష్యాలకు అనుభవం కలిగిన అధ్యాపక బృందం తోడైతే అద్భుత విజయాలను సాధించవచ్చని సీహెచ్ వెంకటేష్ అన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన చెవ్వా వెంకటేష్ పట్టుదలతో కష్టపడి చదివి నేడు 2026 భద్రాది కొత్తగూడెంలో ఎంబీబీఎస్ మెడికల్ సీటు సాధించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొనేలా లక్ష్యాల వైపు అడుగులు వేయడానికి ప్రేరణ కలిగించిన హైదరాబాద్ శ్రీ వశిష్ట రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ అండగా నిలిచి స్ఫూర్తినిచ్చిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికి తీసేలా మ్యాథ్స్ కెమిస్ట్రీ ఫిజిక్స్ బయాలజీ వంటి ప్రతి సబ్జెక్ట్ పై క్లాసులతో పాటు ప్రతి రోజు డేలీ ఛాలెంజ్ టెస్ట్ , వీక్లీ రిటెన్షన్ టెస్ట్ , ప్రతి రెండు వారాలకు ఒక్కసారి క్యుమిలేటివ్ పరీక్షల తోపాటు పూర్తి ప్రతి నెల రిటెన్షన్ టెస్ట్ అలాగే ప్రతి మూడు నెలలకు ఒక్కసారి అన్ని పరీక్ష తరగతులను కలిపి విద్యార్థుల సబ్జెక్ట్ వారిగా ఉన్న డౌట్స్ క్లియర్ చేస్తూ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇలా ఐదు దశలుగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను పరిపూర్ణంగా తీర్చిదిదుతారని తెలిపారు. సాధించాలనే తపన తాపత్రయం తోపాటు అనేక చిన్న చర్యలు ఒక సుదీర్ఘ ప్రక్రియ యొక్క ఫలితం విజన్ ను పూర్తి చేస్తుందని అన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా, మన లక్ష్యం పెద్దదిగా ఉండాలని.. ఈరోజు మీరు పడే కష్టం రేపు మీకు ఇంజనీరింగ్ లేదా డాక్టర్ వంటి తెల్లకోటు రూపంలో రాబోతుందని గుర్తు చేశారు. రోజుకు ఎంత చదివామన్నదికంటే ప్రతిరోజూ చదవడం ముఖ్యమని..తప్పులు వస్తే నిరాశ చెందకుండా ప్రతి తప్పు మీకు ఒక కొత్త పాఠం నేర్పుతుందనీ తెలుకోవాలన్నారు. ఈరోజు కష్టపడి చదివితే రేపు మన తల్లిదండ్రులు గర్వంగా 'మా బిడ్డ డాక్టర్ లేదా ఇంజనీర్ అని చెప్పే రోజు వస్తుందనీ కల కనండి...కష్టపడండి...సాధించే వరకు ఆగకండదన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





**తొలి సమయం, వనపర్తి, సెప్టెంబర్ 04**

వనపర్తి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పెండెం కురుమూర్తి ఢ నాగమ్మగారి ఆహ్వానం మేరకు వారి కుమారుని వివాహానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరైన శ్రీకాంత్ ఢ మౌనికేశ్వరి లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి. వారి వైవాహిక జీవితం ప్రేమ, ఆనందం,సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తున్నాను అని.అక్షింతలు వేసి ఆశీర్వదించారు,గౌరవ మాజీ మంత్రిగారి వెంట మాజీ కౌన్సిలర్ పెండెం నాగన్న యాదవ్, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ పృథ్నాథ్ రెడ్డి, పెండెంట్ శ్రీనివాసులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్) సెప్టెంబర్ 4:**

ఎన్నికలకు ముందు మహిళలకు,వృద్దులకు, వికలాంగులకు, అమలు కానీ హామీలిచ్చి, అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి,1,000 రోజులైనా హామీలు అమలు చేయడం లేదని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కేసముద్రంలోని పూలే సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ మాలోత్ కవిత, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి,మర్రి నారాయణరావు, మహమ్మద్ నజీర్, కామటం శీను, రవీందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, రమేష్, నీలం యాకయ్య, దుబ్బాకుల వెంకన్న,పాయిరాల శరత్, పురం రాజమణి, కొమ్ము రాహుల్, రాజేందర్, యాకరాజ్యం, కుమారస్వామి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య స్నేహితుల ఆర్థిక సహాయం



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 4:**

కేసముద్రంలోని గీతాంజలి హై స్కూల్ 2006-07 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఇటీవల ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తమ బాల్య స్నేహితుడు అయిన కుండే నరేష్ చనిపోవడంతో వారి కుమారులకు ఆర్థిక సహాయం అందించారు. కుండే నరేష్ ఇద్దరు కుమారులు అయిన యుధీర్ సాయి, హర్షిత్ లు వివేకవర్ధిని హై స్కూల్ లో ఆరవ తరగతి నాలుగో తరగతి చదువుతున్నారు. కాగా ఒక సంవత్సరం ఫీజు 43 వేల రూపాయలు బాల్య స్నేహితులు కట్టడం జరిగింది. ఈ సందర్భంగా బాల్య స్నేహితుని కుమారుల చదువుకై ఫీజు చెల్లించిన బాల్య స్నేహితులను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో రవి సార్, బానోతు వీరన్న, సాగర్, కుమార్, బాలాజీ, రవి, కోతి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వంటావార్పు

**తొలి సమయం, వనపర్తి , సెప్టెంబర్ 04**

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో హామీల అమలు ఏదీ? పెన్షన్లు పెంచాలి మహిళలకు రూ.2,500 ఇవ్వాలి.420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి గాంధీచౌక్ లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు పెంచడంతో పాటు మహిళలకు నెలకు రూ.2,500, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి,విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలస రమేష్ గౌడ్, వనపర్తి మండల అధ్యక్షుడు కే. మాణిక్యం



మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని



ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా వితంతువులు, హెచ్ఐవీ బాధితులకు ఆసరా పెన్షన్లు అందించిందని నాయకులు గుర్తుచేశారు. 2014 నవంబర్ 14న కొత్తూరు మండలంలో ఆసరా పెన్షన్లను ప్రారంభించినట్లు తెలిపారు. వృద్ధులు, ఇతర పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే పెన్షన్లను పెంచినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లను మరింత పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, వెయ్యి రోజులు గడిచినా అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో దారుణం - డయల్ 112 కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

**తొలి సమయం - తొర్రూరు, సెప్టెంబర్ 04:**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో అర్ధరాత్రి కత్తిపోటు కలకలం రేపింది. భార్యాభర్తల గొడవకు సంబంధించి వచ్చిన డయల్-112 కాల్ కు వెళ్లిన బ్లూకోట్స్ కానిస్టేబుల్ పై ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.

**అసలేం జరిగింది?**

గురువారం రాత్రి 11.20 గంటల సమయంలో తొర్రూరు పట్టణంలోని రామకృష్ణ టాకీస్ కాలనీ గంగోత్రి వాటర్ ప్లాంట్ ఎదురుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారని ఓ మహిళ డయల్-112 కు సమాచారం ఇచ్చింది. దీంతో తొర్రూరు పోలీస్ స్టేషన్ లో బ్లూకోట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జాటోత్ రామచంద్ర ఘటనా స్థలానికి వెళ్లారు.

అక్కడ విచారిస్తుండగా దంతాలపల్లి మండలం ఆగపేట తూర్పు తండాకు చెందిన గూగులోత్ కోటేశ్వర్ అనే యువకుడు



ఒక్కసారిగా కత్తితో రామచంద్రపై దాడి చేశాడు. ఎడమ చేయి కింద, గుండె సమీపంలో కత్తిపోటు తగిలింది. అంతటితో ఆగకుండా రెండు ఇనుప రాడ్లతో కూడా దాడి చేసినట్లు సమాచారం.

వెంటనే గాయపడిన కానిస్టేబుల్ మరో సిబ్బందికి సమాచారం ఇవ్వగా, పెట్రోలింగ్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి సుమారు ఆరు కుట్లు వేసినట్లు సమాచారం. ప్రస్తుతం కానిస్టేబుల్ రామచంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనకు పాల్పడిన కోటేశ్వర్ ను పోలీసులు అదే రాత్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే మరి సామాన్యుల పరిస్తితి ఏమిటి అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉన్మాదులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు పోలీస్ ఉన్నతాధికారులు చేపట్టాలని స్థానికులు భావిస్తున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బోళ్ల దురేష్

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 4:**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యా యుల జాబితాలో బోళ్ల దురేష్ ఎంపికయ్యారు. కేస ముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు



ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న దురేష్‌కు ఈ అవార్డు దక్కింది. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించింది. అవార్డు దక్కిన ఒదుకుగాను పాఠశాల ప్రధానో పాధ్యాయులు కాట్రగడ్డ చంద్రశేఖర్,తోటి ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు మరియు విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దురేష్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డు వృత్తి పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని వారు తెలిపారు.

# కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 4:**

ధర్మం, ప్రేమ, జ్ఞానానికి ప్రతీక శ్రీకృష్ణుడు అని యాదవ సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శుక్రవారం కేసముద్రం స్టేషన్ లో యాదవ సంఘం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు, యాదవ కులస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.అనంతరం ఉట్లు కొట్టు కార్యక్రమం తో పాటు ప్రధాన కూడలిలో జారుడు స్తంభం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యాదవ సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు అధర్మాన్ని ఎదుర్కొని ప్రజలను రక్షించాడని తెలిపారు. మనిషి తన కర్తవ్యాన్ని నిజాయితీగా చేయాలని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు ప్రజలకు బోధించాడని తెలిపారు .శ్రీకృష్ణుడు కేవలం ఆరాధ్య దైవం మాత్రమే కాదని ఆయన గొప్ప గురువు, స్నేహితుడు,మానవ జీవితానికి మార్గదర్శి అని అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దన్నసరి సింగిల్ విండో వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్ రావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్



డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, సారగొల్ల సంగె రాజ్ కుమార్, మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి నాగనబోయిన వెంకటేశ్వర్లు, అల్లం శ్రీకాంత్,నర్సింగం వెంకటేశ్వర్లు,తోడేటి వెంకటేశ్వర్లు,అల్లం నిరంజన్,కోడి సాయి,తోడేటి నరేష్,ఏలుగు కార్తీక్ యాదవ్, సంగె కిరణ్, ఐరోండ్ల మధు, గణేష్, హరి, శివ, నర్సింగం విష్ణువర్ధన్, ప్రణయ్ కుమార్, రోహిత్, నాలి శివ, చిలుకూరి నందన్, కోడి సాయి,ఉపేందర్, ఎలుగు కార్తీక్ యాదవ్, ఐరోండ్ల మధు, గణేష్, హరి, శివ, నర్సింగం విష్ణువర్ధన్, ప్రణయ్ కుమార్, రోహిత్, నాలి శివ, చిలుకూరి నందన్ తదితరులు పాల్గొన్నారు.

# నకిరేకల్‌లో సీఎం రేవంత్ రెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రేపు నకిరేకల్ పట్టణానికి రానున్న నేపథ్యంలో.. నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న 'ప్రజా వికాస సభ' ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. సభా ఏర్పాట్లను భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో కొనసాగుతున్న ఏర్పాట్లను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లన్నింటినీ పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, మౌలిక సదుపాయాలు తదితర ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. సభా ప్రాంగణంలో ప్రతి అంశాన్ని ముందస్తుగా పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనతో పాటు ప్రజా వికాస సభను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా ఆంగోత్ రాంబాబు

### అభినందించిన ప్రముఖులు.

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 04:**



ఇల్లందు, మండలంలోని కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆంగోత్ రాంబాబు జిల్లా ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోనున్నారు. పాఠశాలలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతిరోజూ డ్రిల్ నిర్వహిస్తూ, వివిధ పోటీల్లో మండల, జిల్లా స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నారు. పాఠశాల కార్యక్రమాలను క్రమశిక్షణతో నిర్వహించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఇల్లందు మండల టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. ఇదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగ నాయక్ సైతం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం విశేషం. ఒకే పాఠశాల నుంచి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్, ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక కావడంపై సర్పంచ్ అజ్మీర బిచ్చ, గ్రామస్తులు, పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 04**



మండల వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో సందడి చేశారు. చిల్ల వరుణ్ తేజ్, శ్రీనిధి తదితర చిన్నారుల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. అదేవిధంగా ప్రత్యేక గోపిక వేషధారణలో ఆ పాత్రకే వన్నెతెచ్చేలా కనిపించిన ఆనబత్తుల కృత్విక అందరినీ మైమరపించి ఆకట్టుకుంది. పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆలయాలను పూలతో శోభాయమానంగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజాము నుండే వెంకటేశ్వర ఆలయం, శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉట్టికొట్టే సంబరాలు ఘనంగా జరిగాయి.

# శిరీషకు న్యాయం చేయాలి.

### అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్.






**తొలి సమయం, ఇల్లందు; సెప్టెంబర్, 04:**

ఇల్లందు , హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఊకే శిరీషపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి జగదాంబ సెంటర్ వరకు కాంగ్రెస్ శ్రేణులు, మహిళా నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదాంబ సెంటర్‌లో మానవహారం చేపట్టి శిరీషకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. శిరీషపై జరిగిన ఘటన అత్యంత బాధాకరమని, సమాజంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి ఎలాంటి మినహాయింపులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. మహిళలు, యువతులు నిర్భయంగా జీవించేలా సమాజంలో భద్రతా భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్వొత్తుల ర్యాలీ, మానవహారం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# భగీరథ యత్నం. వీడని రెవెన్యూ అంధత్వం

**నిరుపేద అంధ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికుల విజ్ఞప్తి.**

**తొలి సమయం, ఇల్లందు ;సెప్టెంబర్, 04:**





| క్ర.సం. | సర్వే నెం. / సబ్ డివిజన్ నెం. | విస్తీర్ణము ఎ.గు. | భూమి పొందిన పద్ధతి | రిమార్కులు | తహశీల్దార్ సంతకం |
|---|---|---|---|---|---|
| 1. | 2/5 | 1.0000 | పౌతి / వారసత్వం / అనువంశికము | పట్టా | [illegible] |
| 2. | 131/7/10 | 1.0500 | పౌతి / వారసత్వం / అనువంశికము | అస్సైండ్ భూమి | [illegible] |
| పూర్తి విస్తీర్ణం | | 2.0500 | | | |



ఇల్లందు/కారేపల్లి, మిషన్ కాకతీయలో సాగుభూమి చెరువులో మునిగిపోయినా పరిహారం అందక, కంటి చూపులేని నిరుపేద కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఘటన ఇల్లందు మండలం రాగబోయిన గూడెం పంచాయతీ పరిధిలోని తెలగగుంపు (తంగెళ్లగడ్డ )లో వెలుగుచూసింది. కుటుంబ సభ్యుల్లో కొందరు పూర్తిగా, మరికొందరు పాక్షికంగా కంటి చూపు కోల్పోయారు. సుమారు నాలుగు ఎకరాల సాగుభూమి చెరువులో మునిగిపోయినా రెవెన్యూ అధికారులు భూమి లెక్కలు పరిశీలించి తగిన పరిహారం అందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుటుంబ యజమాని మరణించిన అనంతరం రైతుబీమా, సామాజిక పింఛన్ విషయంలోనూ అధికారుల నుంచి సరైన సహకారం లభించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సామాజిక పింఛన్లు, రేషన్ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబం వర్షాలకు కురిసే అసంపూర్తి ఇంట్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తోంది. విషయం తెలుసుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కుటుంబంలోని ఒకరికి చికిత్స చేస్తే కంటి చూపు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యం చేయించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ, వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లేవారు లేకపోవడం సమస్యగా మారింది. ఈ కుటుంబ దుస్థితిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, మానవతావాదులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ హామీల అమలుపై ఇల్లందులో బీఆర్ఎస్ వంటా వార్పు

### మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నేతల విమర్శ.

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 04:**





ఇల్లందు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణంలోని జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచుతామన్న పెన్షన్ల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించడం సమంజసం కాదన్నారు. 420 హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో మహిళలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకుడు లకావత్ దేవిలాల్ నాయక్, టిబిజికేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు రంగనాథ్, శీలం రమేష్, మాజీ కౌన్సిలర్లు జెకె శీను, కటకం పద్మావతి, తోట లలిత శారద, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ధర్మానికి దిక్సూచి శ్రీకృష్ణ పరమాత్ముడు

### కృష్ణాష్టమి ఉత్సవాల్లో ఉట్టి కొట్టిన మల్లిబాబు యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్.

**తొలి సమయం, ఖమ్మం; సెప్టెంబర్, 04:**



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మం నగరంలోని 17వ డివిజన్ టీచర్స్ కాలనీ, ప్రకాశ్‌నగర్‌తో పాటు చింతకాని మండలం కొదుమూరు, వైరా మండలం అష్టగుర్తి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, నాగనబోయిన రాజారాం పాల్గొని యాదవ యువకులను ప్రోత్సహించారు. బాలకృష్ణుడు గోపికలు ఉట్టిపై దాచిన వెన్నను దొంగిలించేందుకు చేసిన ప్రయత్నాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. యువకులు ఉట్టి తాడు లాగుతూ, ఉట్టి కొడుతూ సందడి చేయడంతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ.. మూగజీవాలను కంటికి రెప్పలా కాపాడుతూ, గోవులను సంరక్షిస్తూ జీవించే యాదవుల వంశంలో శ్రీమహావిష్ణువు దశావతారాల్లో భాగంగా గోవిందుడిగా, దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించే శ్రీకృష్ణ పరమాత్ముడిగా అవతరించడం యాదవ సమాజానికి గర్వకారణమన్నారు. యాదవుల చరిత్ర, పురాణాల్లో ఎన్నో గొప్ప విశేషాలు ఉన్నాయని తెలిపారు. మహాభారత యుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత యుగాలు, తరాలు మారినా ప్రపంచవ్యాప్తంగా ధర్మానికి దిక్సూచిగా నిలుస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి, ఆ మహాగ్రంథాన్ని తమ ఇళ్లలో ఉంచుకోవాలని సూచించారు. గతంలో కాటమరాజు, ప్రతాపరుద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు వంటి యాదవులు రాజ్యాలను పాలించి ప్రజలను సుఖశాంతులతో ఉంచినట్లు చరిత్ర చెబుతోందన్నారు. యాదవులంతా ఐక్యంగా ఉంటే గతంలో కోల్పోయిన వైభవాన్ని ఉత్తర భారతదేశంలో మాదిరిగా ఇక్కడ కూడా సాధించవచ్చని పిలుపునిచ్చారు. కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో నాగనబోయిన నాగరాజు, కొమ్ము శ్రీశైలం, కొమ్ము మల్లయ్య, మట్టపల్లి వెంకన్న, కొమ్ము శ్రీను, అవిరేని శ్రీను, వీరబోయిన సైదులు, అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, కార్యకర్తలు, వృద్ధులు, బాలురు, మహిళలు తదితరులు భారీగా పాల్గొన్నారు.



# తుక్కుగూడ ఘటన దుర్మార్గం

### ఊకె శిరీష కుటుంబాన్ని పరామర్శించిన కల్పనా చౌదరి

**తొలిసమయం, పాల్వంచ, సెప్టెంబర్ 4**



: తుక్కుగూడలో జరిగిన ఘటన అత్యంత దుర్మార్గమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొల్లి ఫౌండేషన్ ప్రతినిధి కల్పనా చౌదరి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఊకె శిరీష కుటుంబాన్ని ఆమె పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కొల్లి ఫౌండేషన్ తరపున శిరీష కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. న్యాయం జరిగే వరకు ఫౌండేషన్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వారికి అండగా నిలవాలని కల్పనా చౌదరి పిలుపునిచ్చారు. శిరీష ఘటనలో నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని ఆమె పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈహెచ్ఎస్ కింద నిమ్స్‌లో ఉచిత ఓపీ సేవలు: మంత్రి దామోదర రాజనర్సింహ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఎన్ఈహెచ్ఎస్) కింద నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలను ఉచితంగా అందించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు ఉచిత ఓపీ సేవలను యథావిధిగా కొనసాగించాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు స్పష్టం చేశారు. ఎన్ఈహెచ్ఎస్ మార్గదర్శకాల ప్రకారం నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో కేవలం ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవలు, వెల్‌నెస్ సెంటర్లలో మాత్రమే ఓపీ సేవలు అందించాల్సి ఉంది. అయితే ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిమ్స్ ఆసుపత్రిలోనూ అవుట్‌పేషెంట్ సేవలను ఉచితంగానే కొనసాగించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం వెల్‌నెస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను ప్రభుత్వం భారీగా విస్తరిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్లు సేవలు అందిస్తుండగా, ప్రభుత్వం తాజాగా మరో 24 కొత్త సెంటర్లను మంజూరు చేసింది. ఇప్పటివరకు వెల్‌నెస్ సెంటర్లు లేని అన్ని జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంలోనూ అదనంగా మరో మూడు వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. జనరల్ ఆసుపత్రులకు అనుసంధానిస్తూ ఈ వెల్‌నెస్ సెంటర్లలోనూ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కిడ్నీ మాయం చేశారన్న ఆరోపణలపై విచారణయాదాద్రి జిల్లాలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో గర్భసంచి ఆపరేషన్ కోసం వెళ్తే, కిడ్నీ తీసేశారంటూ పేషెంట్ కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని జిల్లా డీఎంహెచ్‌వోను పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. రవిందర్ నాయక్ ఆదేశించారు. మంత్రి ఆదేశించిన వెంటనే స్పందించిన నిమ్స్ యాజమాన్యం రేపటి నుంచి ఈహెచ్ఎస్ లబ్దిదారులకు ఓపీ సేవలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. తాజాగా మరో 24 కొత్త సెంటర్లను మంజూరు చేసింది. ఇప్పటివరకు వెల్‌నెస్ సెంటర్లు లేని అన్ని జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంలోనూ అదనంగా మరో మూడు వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. జనరల్ ఆసుపత్రులకు అనుసంధానిస్తూ ఈ వెల్‌నెస్ సెంటర్లలోనూ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సీక్వెల్




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'లక్కీ భాస్కర్' . ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి మనీ లాండరింగ్, హవాలా ద్వారా ఎలా కోటీశ్వరుడిగా మారారు? తనను స్కామ్‌లో ఇరికించాలనుకున్న వారినే ఎలా ఇరికించి దేశం దాటేశారు? అనేదే ప్రధానాంశంగా సినిమా రూపొందించారు. ఈ మూవీ క్లైమాక్స్‌లోనే సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. త్వరలోనే లక్కీ భాస్కర్ సీక్వెల్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. 'చాలా మంది లక్కీభాస్కర్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. సీక్వెల్ మరింత పవర్ ఫుల్ స్టోరీతో రాబోతోంది.' అని చెప్పారు. దుల్కర్ సల్మాన్ సైతం లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు తాను ఏ మూవీ ఈవెంట్స్‌కు వటటల్లినా లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం వెళ్లానని... ప్రతీ ఒక్కరికీ ఆ స్టోరీ బాగా కనెక్ట్ అయ్యిందని తెలిపారు. ఫస్ట్ పార్ట్‌లో 100 కోట్ల స్కామ్‌కు పాల్పడిన వ్యక్తిగా హర్షద్ మెహతా రోల్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫేక్ బీఆర్స్‌తో బ్యాంక్ నగదును స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడిన తీరును చూపించారు. అయితే, ఆయన ఎవరు అనేది రివీల్ చేయలేదు. సీక్వెల్‌లో హర్షద్ మెహతా బ్యాగ్రౌండ్‌తో పాటు సీబీఐ ఎంక్వైరీ, భారీ స్కామ్ నుంచి తప్పించుకున్న లక్కీ భాస్కర్ మళ్లీ ఇండియాకి తిరిగివచ్చాడా? ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లో సూపర్ హింట్ ఇస్తూనే సీక్వెల్ స్టోరీపైనా క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ పార్ట్‌లో దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించారు. సీక్వెల్‌లో మరిన్ని రోల్స్ యాడ్ కానున్నట్లు సమాచారం.

# చదువు మధ్యలో ఆపినందుకు ఇప్పటికీ బాధగా ఉంది

కరీనా కపూర్



బాలీవుడ్ ప్రముఖ నటి కరీనా కపూర్ తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేయలేకపోయాననే లోటు తనలో ఇప్పటికీ ఉండిపోయిందని అన్నారు. సినిమాలపై ఉన్న మక్కువతో చదువును మధ్యలోనే ఆపేయడం పట్ల ఆమె తాజాగా విచారం వ్యక్తం చేశారు. కేవలం 19 ఏళ్ల వయసులో, 2000 సంవత్సరంలో అభిషేక్ బచ్చన్ సరసన 'రెఫ్యూజీ' సినిమాతో నటిగా తెరంగేట్రం చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా సినిమాలపైనే దృష్టి పెట్టడంతో పదకొండవ తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.
తన వ్యక్తిగత అనుభవం దృష్ట్యా, తన కుమారులు ముందుగా చదువును పూర్తిగా ముగించుకున్న తర్వాతే తమకు ఇష్టమైన రంగాల వైపు అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇక భారతదేశంలో బాలికల విద్యను ప్రోత్సహించేందుకు యూనిసెఫ్ తనను సంప్రదించినప్పుడు, తన విద్యాభ్యాసం అసంపూర్తిగా మిగిలిపోయిందనే వెలితి కారణంగానే తాను ఆ ఉద్యమంతో మానసికంగా మరింతగా కనెక్ట్ అయ్యానని తెలిపారు.
హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రనటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కరీనా, ప్రస్తుతం మేఘనా గుల్జార్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్‌తో కలిసి నటిస్తున్న దైరా చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి



సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.

# 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.

# టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్..



రాకింగ్ స్టార్ యష్ నటించిన టాక్సిక్ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద జర్నీని కొనసాగిస్తున్నది. ఈ చిత్రం కన్నడ, హిందీ భాషల్లో భారీ వసూళ్లను సాధిస్తున్నది. అయితే గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేయకుండా నిర్ణయం తీసుకొన్నారు. అయితే దాదాపు రెండో వారంలో ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేసేందుకు సిద్దమయ్యారు. భారతీయ సినిమా రంగంలో అగ్రతారలు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ నటించిన ఈ సినిమాను దక్షిణాదిలో అగ్ర సినీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కే నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్‌ను వాయిదా వేశారు. టాక్సిక్ విషయానికి వస్తే.. ఈ సినిమాను ఒరిజినల్‌గా కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో షూట్ చేశారు. దానిని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లోకి డబ్ చేసి విడుదల చేశారు. అయితే ఇంగ్లీష్ భాషలో రూపొందించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడిందని చిత్ర యూనిట్ వెల్లడించింది. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను సెప్టెంబర్ 4వ తేదీన రిలీజ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పరిమితమైన లోకేషన్లు అంటే.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, తిరువనంతపురం, ఇతర ప్రాంతాల్లో రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు రీ సెన్సార్ చేసినట్టు తెలిసింది.

# సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా కనిపిస్తోంది

## రోమాంచకంపై మహేశ్ బాబు వ్యాఖ్యలు




యువ హీరో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటించిన లెటెస్ట్ మూవీ 'రోమాంచకం'. వేణు గోపాల్ రెడ్డి రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరించారు. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ మూవీపై అనౌన్స్‌మెంట్ నుంచే యూత్‌లో ఆసక్తి ఏర్పడింది. ఇప్పటికే ప్రీమియర్స్ తర్వాత సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వస్తుండగా.. సూపర్ స్టార్ మహేశ్ బాబు చేసిన ఓ పోస్టు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'రోమాంచకం' చూసిన అనంతరం మహేశ్ బాబు తన సోషల్ మీడియా ఖాతాలో స్పందించారు. సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా, ప్రామిసింగ్‌గా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా సహా మూవీ టీం మొత్తానికి మహేశ్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్‌లో టీమ్ పెట్టిన ప్రేమ, ప్యాషన్, హార్డ్ వర్క్ స్పష్టంగా కనిపిస్తున్నాయని మహేశ్ ప్రశంసించారు. ఇంత కష్టపడి రూపొందించిన సినిమాకు తగిన ఫలితం తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఒక యంగ్ టీమ్ చేసిన ప్రయత్నాన్ని సూపర్ స్టార్ ఈ స్థాయిలో ప్రశంసించడం సినిమాకు మంచి బూస్ట్‌గా మారింది. మహేశ్ బాబు చేసిన ఈ పోస్టుకు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా స్పందించారు. తమ

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...